

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

**"షాపింగ్ చెయ్యాలా?" అన్నయ్య అడిగాడు.**

"లేదు" బదులిచ్చాను.

రేపు తిరిగి వెళ్ళిపోతున్నాను. దిగులు కాస్త మొదలైంది. అన్నయ్య దగ్గరే ఉంటే ఎంత బావుండేదో అనిపించింది. అమ్మమాట వినాల్సింది. రేపు ఈపాటికి విమానంలో ఉంటాను. తలచుకుంటేనే ఏడుపొస్తుంది.

"పచ్చళ్ళు ఏమైనా కావాలా?" అడిగాడు.

"వద్దు."

"పొడులు, ఉలవచారు?"

"అక్కరలేదు."

కష్టపడి ఏడుపు దిగమింగుతుంటే అన్నయ్య ఈ ప్రశ్నలు అడగడం అవసరమా!

"ఫ్లైట్ ఎప్పుడు?"

"వన్"

"ఆన్లైన్ చెకిన్ చేసావా?"

"చేసాను."

ఇంకా ఎన్ని ప్రశ్నల అడుగుతాడో ఏంటో. అన్నయ్య నన్ను ఏడుపించేలోపు టాపిక్ మార్చాలని "సూట్‌కేస్ సర్దుతా" అంటూ లేచాను.

"రాత్రికి సర్దచ్చులే. బయటికి వెళ్దాం."

"సరే అంటూ చెప్పులు వేసుకున్నాను"

కారెక్కాక అంతా నిశ్శబ్దం. కొద్దిసేపటికి పాటలు పెడదాం అనుకుంటుండగా "దిగులుగా ఉందా?" అడిగాడు.

ఇంట్లో అయితే వేరే గదిలోకి వెళ్ళొచ్చు. కారులో అనవసరంగా ఇరుక్కుపోయాను అనిపించింది. సమాధానం చెప్పలేదు.

"నెక్స్ట్ మంత్ థాంక్స్ గివింగ్ సెలవలు ఉంటాయి" అన్నాడు.

నేను బదులివ్వలేదు.

"వారం సెలవలు" అన్నాడు.

మళ్ళీ బదులివ్వలేదు.

"అంటే నువ్వు రేపు వెళ్ళాక మళ్ళీ ఓ మూడు వారాల్లో నా దగ్గరికి వచ్చేస్తావు" అన్నాడు.

అన్నయ్య వైపు చూసి "నిజంగానా?" అడిగాను.

"ఔను. మూడువారాలు కూడా నువ్వు క్లాసులతో బిజీగా ఉంటావు. కళ్ళు మూసుకుని తెరిచేలోపు అయిపోతాయి. మళ్ళీ అక్కడ విమానం ఎక్కి ఇక్కడ దిగుతావు."

చెవులో అమృతపు చుక్కలు పోసినట్టు అనిపించింది.

"ఈసారి ఏం షాక్ ఇస్తావో" వెటకారంగా అన్నాడు.

"షాకేంటి?" అడిగాను.

"ఈసారి క్రాప్ జీన్స్ వేసుకుని వచ్చావు కదా. నెక్స్ట్ టైం ఇంకెంత మారుతావో అంటున్నా" నవ్వాడు.

నిజానికి నేను పోట్లాడాలి కానీ నాకు నవ్వొచ్చింది.

కొంతదూరం వెళ్ళాక "నాకు దిగులుగా ఉందని నీకెలా తెలుసు?" అడిగాను.

"మొదటిసారి బయటికి వెళ్దాం అంటే పరిగెత్తి దువ్వెన తీసుకోకుండా చెప్పులు వేసుకున్నావు. 'ఎక్కడికి' అనికూడా అడగలేదు. దానిపైన ఉలవచారు వద్దన్నావు."

మరికొంతసేపు నిశ్శబ్దం.

"ఇంతకీ ఎక్కడికి వెళుతున్నాము?" అడిగాను.

"గార్డెన్‌కి"

"గార్డెనా? ఇంతదూరం వెళ్ళేది గార్డెన్ కోసమా ముందే అడిగి ఉండాల్సింది నేను" కసురుకున్నాను.

"ఇది ఇండియాలోలాంటి గార్డెన్ కాదు. చూడగానే నీకళ్ళు పేలిపోతాయి"

"అబ్బ ఛా. చూద్దాంలే"

మొత్తానికి చేరాం. రోడ్డు పక్కన కారుని ఆపి "పద" అన్నాడు.

"ఎక్కడికి?"

"స్వర్గంకి"

"వెటకారమా?"

"కాదు. చూస్తే నీకే తెలుస్తుంది."

"రోడ్డు మీద ఏంటి? జపం చెయ్యాలా?"

"నువ్వు దిగులుగానే నయం. ఈ వెటకారం ఉండదు."

కోపంగా చూసాను.

కొంత దూరం నడిచాము.

"వెనక చూడు" అన్నాడు.

వెనక్కి తిరిగితే కారు ఎంతో దూరంలో ఉంది. ఏదో పెయింటింగ్‌లాగా వెనక మంచు కొండలు, గడ్డి, చెట్లు . ఎంతో అందంగా ఉంది. అలానే చూస్తూ ఓ నిమిషం ఉండిపోయాను.

"నచ్చిందా?" అడిగాడు.

"చాలా బావుంది."

"కళ్ళు పేలాయి?"

"లేదు."

"గుడ్. ఇంకా కిందకి వెళ్ళాక అప్పుడు చూద్దాం."

ఏముంది? మళ్ళీ ఇలాంటి వ్యూ ఉంటుంది. అంతే కదా అనుకున్నాను.

"కాళ్ళు నొప్పి ఇంకా ఎంతసేపు?" అడిగాను.

"వచ్చేసాం. ఇంకో నాలుగడుగులు. అంతే"

కొద్దిసేపటికి "నాలుగడుగులు అయ్యి నాలుగడుగులైంది" అన్నాను.

"అబ్బా, కాస్త ఓపిక పట్టు. అక్కడ ఓ చెట్టుందే, ఆ చెట్టు వరకు వెళ్ళాలి.

ఏ చెట్టా అని అన్నయ్య వైపు చూసాను కానీ ఏదీ కనిపించకపోయేసరికి కసురుకుని "ఎగతాళా? నేను కారు దగ్గరికి వెళ్ళిపోతా" అన్నాను.

"అటువైపు చూడు" అంటూ చెయ్యి ఎడం వైపుకి చూపాడు.

నా కళ్ళని నేను నమ్మలేదు.

అది గార్డెన్ కాదు. పూల కొండ. ఎటు చూసినా పూలే. పింక్, ఎల్లో ఇంకా వయిలెట్ రంగుపూలు. ఎంతోమందికి నచ్చే ఎరుపు రంగుపూలు ఎందుకు లేవు అనే ఆలోచనకూడా రాలేదు. అన్ని పూల చెట్లకి ఎన్నో ఆకులు ఉన్నా, ఆ పూలరంగు మాత్రమే నా కళ్ళకి కనబడింది.

"కారెక్కుతవా?" అన్నయ్య అడిగాడు.

"లేదు. లోపలకి వెళ్ళొచ్చా?" అడిగాను.

"అబ్బో, పూలు నీ కోపాన్ని మాయం చేసాయే. వెళ్ళు కానీ తప్పిపోకు."

"సరే" మళ్ళీ కోపం రాలేదు.

పూలలో చంద్రముఖిలా చేసి ఆ అందాన్ని ఆశ్వాదించాను. ఇంత అందమైన భూమి ఉన్నప్పుడు జనాలు బాంబులు వేసి ప్రకృతిని ఎలా పాడుచేస్తారో అనిపించింది. అలాంటి వాళ్ళు యుద్ధం పేరు చెప్పినా సైకోలే అని నా అభిప్రాయం. కాపాడడం వేరు, ధ్వంశం చేయడం వేరు. వెంటనే అన్నయ్య వైపుకి తిరిగి "నీకు ఏం అనిపిస్తుంది?" అడిగాను.

"నువ్వు ఎంజాయ్ చేస్తున్నావనిపిస్తుంది" అన్నాడు.

"కాదు. ఈ పూలు చూస్తే నీకు ఎలాంటి ఆలోచనలు వస్తున్నాయి?" అడిగాను.

"ఇదే ఇండియాలో అయితే అక్కడ ఒక టీ బండి, ఇక్కడ ఒక సిగరెట్ పీక ఉంటాయి అనే ఆలోచన వస్తుంది" నవ్వాడు.

"ఇంకా?"

"నీకు ఏం ఆలోచనలు వస్తున్నాయి?" అడిగాడు.

"ఇంత ప్రకృతిని ప్రేమించకుండా బాంబులు వేసి ఎందుకు పాడు చేస్తారో అనిపిస్తుంది. యుద్ధం మొదలు పెట్టాలనుకుంటున్న వాళ్ళని ఇలాంటి చోట ఓ గంటసేపు ఉండమనాలి. ఆ తరువాత కూడా యుద్ధం ప్రారంభించాలనుకుంటే వాళ్ళకి ఎలక్ట్రిక్ షాక్ ఇవ్వాలి" అన్నాను.

"నీలో ఈ ఏంగిల్ కూడా ఉందా?" నవ్వి, "అటు తిరుగు. ఫోటో తీస్తా" అన్నాడు.

అక్కడ ఎంతసేపు ఉన్నామో తెలీదు కానీ సూర్యాస్తమయ అయ్యేలా ఉంది. ఆ ఎర్రటి సూర్యుడి వెలుగులో పూలు, చెట్లు, ఆకాశం అంత మెరిసింది. పక్షిని అయ్యుంటే ఎగురుతూ ఈతకొట్టేదాన్ని. నీళ్ళలో ఉండే జీవాలు పాపం ఈ అందాన్ని చూడలేవు. ఏదో జన్మలో శాపం కాబోలు.

"పద. చీకటైతే వెళ్ళడం కష్టం" అన్నాడు అన్నయ్య.

"ఇంకొంచెం సేపు" అన్నాను.

ఓ నిమిషం తరువాత మళ్ళీ అదే అన్నాను.

దాంతో " చీకటైతే పాములు వస్తాయి" అన్నాడు.

ఆ మాటతో నేను తిరిగి మనలోకానికి వచ్చాను.

"పద అయితే" అని దాదాపు పరిగెత్తాను.

కారెక్కాక "నచ్చిందా?" అడిగాడు.

"చాలా చాలా చాలా నచ్చింది" అన్నాను.

"నువ్వు ఫిలాసఫీ చదివావా?" అడిగాడు.

"లేదు. బోరింగ్" అన్నాను.

"చదవకుండా ఎలా బోరింగ్ అంటావు?" సమాధానం చెప్పలేదు.

"లైబ్రరీలోంచి అరిస్టాటిల్ ఇంకా థామస్ హోబ్స్ పు స్తకాలు తీసుకో. నీకు వచ్చిన ప్రకృతి, యుద్ధం ఆలోచనలకి" అన్నాడు.

సరే అని తెలీకుండానే ఓ కునుకు తీసాను.

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

Click here to share your comments on this story